క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: చెట్ల నరికివేత కారణంగా శుక్రవారం సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ రవీందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1 గంటల వరకు తుర్కయంజాల్ ప్రాంతంలోని లక్ష్మీమెగా టౌన్‌షిప్, పాటిగూడ, సూరజ్ నగర్, లక్ష్మీ గార్డెన్, కుర్మగూడ, వైఎస్ఆర్ కాలనీ, యంజాల్ గ్రామంలో సరఫరా నిలిపివేయనున్నారు. అదే విధంగా మాసబ్ చెరువు పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగర్ రెసిడెన్సీ, సాగర్ ఎన్‌క్లేవ్, రాఘవేంద్ర కాలనీ, సాయిరామ్‌నగర్, జనచైతన్య కాలనీ, సూర్యసాయి నగర్, గంగిరెడ్డి వెంచర్, శ్రీశ్రీ ఎన్‌క్లేవ్‌లో అంతరాయం కలగనుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా చర్లపటేల్‌గూడ 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ అఖిలేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్లపటేగూడ, ఖానాపూర్ గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

సమన్వయంతో మెలగాలి

మంచాల: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల మండల కేంద్రానికి చెందిన పేరూరి ప్రసన్న కుమార్ శర్మ.. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే మల్‌రెడ్డిని, ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువ కప్పి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నెరవేర్చాలని సూచించారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, మాజీ సర్పంచ్ సత్తయ్య పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

యాచారం: మండల పరిధి నందివనపర్తి గ్రామం ఓంకారేశ్వరాలయంలో గురువారం శివ, పార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. తొలుత ఆలయ ధర్మకర్త పప్పు వెంకటశివకుమార్ ఆధ్వర్యంలో శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవతామూర్తుల కల్యాణం జరిపించారు. విశ్రాంత తహసీల్దార్ విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబీకులు ధ్వంజ స్తంభానికి ఇనుప తొడుగును బహూకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, జోగిరెడ్డి పాల్గొన్నారు.

ఆరేళ్లలోపు పిల్లలు.. అంగన్‌వాడీలో ఉండాలి

ఆమనగల్లు: ఆరు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని కార్యకర్త రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి కాటన్‌మిల్లు అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆటపాటలతో పిల్లలకు విద్య అందిస్తామని తెలిపారు. ఆయా దేవమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ఆమనగల్లు: రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని, దాని ఆధారంగా పంటలకు ఎరువులు వాడాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.మాధవి సూచించారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు నిర్వహించారు. రైతులకు భూసార పరీక్షలు, పచ్చిరొట్ట ఎరువుల సాగు, బయో ఫర్టిలైజర్ వాడకం, పంట మార్పిడి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదు పొందాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త మీనాక్షి, వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

'రైతు భరోసా'కు దరఖాస్తు చేసుకోండి

మంచాల: లబ్ధిపొందని రైతులు 'రైతు భరోసా'కు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి లింగస్వామి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గతంలో చేసుకున్న మరోసారి చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలతో మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయాధికారులకు అర్జీలు అందజేయాలని సూచించారు.

హాజరు అంతంతే..



ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థినులు

ఆమనగల్లు: పాఠశాలల పునఃప్రారంభం మొదటి రోజున విద్యార్థుల హాజరు శాతం అంతంతమాత్రంగానే ఉంది. పదిశాతం కూడా రాలేదు. ఆమనగల్లు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రార్థన సమయానికి 9 మంది మాత్రమే వచ్చారు. 253 మంది విద్యార్థులకు 25 మందే వచ్చారని ప్రధానోపాధ్యాయులు రామలక్ష్మి తెలిపారు. 22 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి నుచ్చుగుట్టతండా పాఠశాలను మామిడి తోరణాలతో అలంకరించారు. బడిబాట ర్యాలీ నిర్వహించారు. చిన్నారులకు యూనిఫామ్స్ అందజేశామని హెచ్ఎం సామ సునీత రెడ్డి తెలిపారు.

తొలిరోజు పరమాన్నం



బాలుర ఉన్నత పాఠశాలలో అడ్మిషన్స్ తీసుకుంటున్న విద్యార్థులు

కడ్తాల్: బడిగంట మోగింది. విద్యాసంవత్సరం పునఃప్రారంభం రోజున విద్యార్థులతో పాఠశాలల్లో సందడి నెలకొంది. తొలి రోజు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు 201 మంది విద్యార్థులకు గాను 42 మంది, 17 మంది ఉపాధ్యాయులకు 16 మంది హాజరయ్యారు. బాలికల ఉన్నత పాఠశాలలో 150కి 18 మంది హాజరయ్యారు. ఉపాధ్యాయులు 12 మంది వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ, రాత పుస్తకాలతో పాటు, యూనిఫామ్స్ అందజేశారు. పలువురు అడ్మిషన్లు తీసుకున్నారు. మధ్యాహ్న భోజనంలో పరమాన్నం వడ్డించారు.

బురదకుంటతో ఆహ్వానం



మాల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు

యాచారం: పేరుగొప్ప.. ఊరుదిబ్బలా మారింది మాల్ పాఠశాల దుస్థితి. జాతీయ స్థాయిలో 'ఆత్మ నిర్భర్' ప్రత్యేక పంచాయతీ అవార్డు పొందిన గ్రామం.. బురదమయం అయిన పాఠశాల ఆవరణతో విద్యార్థులకు తొలిరోజు ఆహ్వానం పలికింది. తేలికపాటి వర్షానికి నీరు నిలిచి అసౌకర్యంగా దర్శనమిచ్చింది. ఇదే ఆవరణలో ఉన్నత పాఠశాలతో పాటు.. ప్రాథమిక, అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుండగా.. సుమారు 250 మందికి పైగా బాలబాలికలు విద్యనభ్యసిస్తున్నారు. రోజుల తరబడి నిలిచిన నీటితో దుర్వాసనతో పాటు, దోమలు, ఈగలు పెరిగాయని.. సమస్య గురించి ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులతో పాటు, పాఠశాల హెచ్ఎం విమల ఆరోపించారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి రాజును.. వివరణ కోరగా.. రెండు రోజుల్లో మట్టి పోసి, నీరు నిల్వకుండా చేస్తానని చెప్పారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పాఠశాలల పునఃప్రారంభాన్ని పురస్కరించుకొని గురువారం ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు అందజేసి మాట్లాడారు. విద్యతోనే చక్కటి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి, ఎంఈఓ హీర్యానాయక్, ఎంపీడీఓ జంగయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాల సమస్య తీరింది



లింగంపల్లిలో పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మంచాల: గతంలో సర్కార్ బడులకు పాఠ్య పుస్తకాల సమస్య ఉండేది. ఈసారి అలాంటి ఇబ్బంది లేదు. ముందస్తుగానే పాఠశాలలకు బుక్స్ చేరుకున్నాయి. యూనిఫామ్స్ సిద్ధంగా ఉన్నాయి. మంచాల మండలంలో 10 ఉన్నత, 17 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, ఒకటి కేజీబీవీ, మరొకటి ఆరుట్ల ఆదర్శ పాఠశాల ఉంది. గతేడాది లెక్కల ప్రకారం 2వేల 714 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం ఇంకా ప్రవేశాలు కొనసాగుతున్నాయి. మండలానికి మొత్తం 15వేల 596 పాఠ్య పుస్తకాల అవసరం ఉంది. వాటిలో 13 వేలు వచ్చాయి. 6,7 తరగతి వారికి 8 నోటు పుస్తకాలు, 9వ తరగతి వారికి 10, టెన్త్ విద్యార్థులకు 12 నోటు పుస్తకాల చొప్పున పంపిణీ చేశారు. మొత్తం 90శాతం పుస్తకాలతో పాటు, ఒక జత యూనిఫాం అందజేశారు.

సంతోషంగా ఉంది



గతంలో నెలలు గడిచిన తరువాత కూడా పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు ఇచ్చేవారు కాదు. ప్రస్తుతం మొదటి రోజే పాఠ్య, రాత పుస్తకాలు ఇచ్చారు. యూనిఫాం ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– అశ్వల సాయిరాం, 5వ తరగతి, మంచాల

ప్రత్యేక దృష్టి



విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గతం కంటే ఈ సారి పాఠశాలలకు ముందస్తుగానే పాఠ్య, రాత పుస్తకాలు, యూనిఫాం సరఫరా చేసింది. 90 శాతం విద్యార్థులకు అందజేశాం. ప్రవేశాలు కొనసాగుతున్నాయి. నాలుగైదు రోజుల్లో పది శాతం పంపిణీ చేస్తాం.

– రాందాస్, ఎంఈఓ, మంచాల

బడిగంట మోగింది

పాఠశాలల పున:ప్రారంభంతో పండుగ వాతావరణం నెలకొంది. మొన్నటి వరకు ఆటపాటలతో సరదాగా గడిపిన చిన్నారులు.. వేసవి సెలవులకు టాటా చెబుతూ గురువారం బడిబాట పట్టారు. అమ్మమ్మ, నానమ్మ, బంధువుల ఇళ్లల్లో చేసిన అల్లరి జ్ఞాపకాలతో.. బుజాన పుస్తకాల సంచి భారమనిపించినా.. సంతోషంగా బడి గడపతొక్కారు. తోటి మిత్రులు, గురువులతో మమేకం అయ్యారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఎప్పటిలాగే వారికి సమస్యలు స్వాగతం పలికాయి.

సాక్షి పరిశీలన

పుస్తకాల సంచితో చిన్నారుల బడిబాట

- సందడిగా మారిన పాఠశాలలు
- తొలిరోజు భారంగా భావించిన విద్యార్థులు
- రేపుమాపు అంటూ మారాం చేసిన బాలబాలికలు
- బుజ్జగించిన తల్లిదండ్రులు.. స్వాగతం పలికిన ఉపాధ్యాయులు



మాడ్గుల: ఇర్విన్ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్ అందజేస్తున్న హెచ్ఎం పర్వతాలు

పచ్చ తోరణాలతో స్వాగతం



మాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ పాండురంగారెడ్డి

యాచారం: విద్యాసంవత్సరం ప్రారంభం రోజున పాఠశాలలు పచ్చని తోరణాలు, సరస్వతీ చిత్రపటాలతో చిన్నారులకు స్వాగతం పలికాయి. ఉపధ్యాయ బృందం చదువుల తల్లికి పూజలు చేయించి బాలబాలికలను తరగతి గదులకు తీసుకెళ్లారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు అందజేశారు. మధ్యాహ్న భోజనం వండటానికి వంట సిబ్బంది పాత్రలను శుభ్రం చేశారు. మొదటి రోజు అంతంత మాత్రమే విద్యార్థులు హాజరయ్యారని మండల విద్యాధికారి పాండురంగారెడ్డి తెలిపారు. యాచారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ నందివనపర్తి తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి.. టెన్త్ పూర్తి చేసుకున్న వారిని కళాశాలలో చేరాలని విజ్ఞప్తి చేశారు.



ఉన్నత పాఠశాలలో భోజనం వండటానికి పాత్రలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

మెరుగైన ఫలితాలు సాధించండి

తుర్కయంజాల్: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం ఇంజాపూర్ ఉన్నత పాఠశాలలో చిన్నారులకు పాఠ్య, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నాణ్యమైన విద్యను బోధిస్తుందని తెలిపారు. పుస్తకాలు, దుస్తులు తదితర వాటిని ఉచితంగా ఇవ్వడంతో పాటు, మెరుగైన వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బాలబాలికలు సద్వినియోగం చేసుకుని, మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఉన్నఊరికి, కన్నవారికి పేరుప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఎంఈఓ జగదీష్, మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కమ్మగూడ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

సమస్యల పరిష్కారానికి కొత్తచట్టం



కడ్తాల్: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న డీటీ ఆదిత్యరాజు



ఆమనగల్లు: పోలెపల్లి సదస్సులో దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు

- రైతు సదస్సులు వినియోగించుకోండి
- అధికారులు, నాయకులు

ఆమనగల్లు/కడ్తాల్: రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టం తెచ్చిందని డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్యరాజు అన్నారు. అందులో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గురువారం కడ్తాల్ మండల పరిధి ముద్విన్‌లో సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలకు సంబంధించి 58 దరఖాస్తులు స్వీకరించామని అధికారులు తెలిపారు. ఇందులో ఆర్ఐ రాజేందర్‌రెడ్డి, నాయకులు నరేశ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఆమనగల్లులో..

రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామం రైతు వేదిక భవనంలో గురువారం సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై 27 దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ అయూబ్, మాజీ సర్పంచ్ బల్‌రాం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమార్, బుచ్చిరెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఇర్విన్ గ్రామంలో..

మాడ్గుల: రెవెన్యూ సదస్సులతో రైతుల భూ సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉందని తహసీల్దార్ వినయ్ సాగర్ అన్నారు. గురువారం మండల పరిధి ఇర్విన్ గ్రామంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శివ పాల్గొన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కడ్తాల్: బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీశైలంగౌడ్ కలిసి పార్టీ బలోపేతానికి చేపట్టవలసిన కార్యక్రమాలపై చర్చించారు. పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు ఆమోదించిన మండల కమిటీని ప్రకటించారు. పార్టీ మండల ఉపాధ్యక్షులుగా కుమార్, వెంకటేశ్, బలవంత్‌రెడ్డి, బాణవత్ బుజ్జి, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్, విక్రాంత్, కార్యదర్శులుగా నేనావత్ దశరథ్‌నాయక్, కుమార్, సాయిలు, మల్లేశ్, కోశాధికారిగా రాధిక, 35 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మాన్యనాయక్, ఎస్టీమోర్చా జిల్లా నాయకుడు లక్ష్మణ్‌నాయక్, వెంకటేశ్ యాదవ్, జోగ్యనాయక్ తదితరులు ఉన్నారు.

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కడ్తాల్: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు, తాత్కాలిక(అతిథి) మహిళా అధ్యాపకులు కావాలని పాఠశాల ఎస్ఓ అనితా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఆంగ్లం, గణితం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, భౌతిక, రసాయన శాస్త్రాలు బోధించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. అర్హతగల వారు ఆయా సబ్జెక్టుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ కలిగి ఉండాలన్నారు. అర్హులైన వారు.. ఈ నెల 18వ తేది సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40 సీట్లు ఉన్నాయని, ఇంగ్లిష్ మీడియం చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బీజేపీతో అద్భుత ప్రగతి

ఆమనగల్లు: పదకొండేళ్ల బీజేపీ పాలనలో దేశం అద్భుత ప్రగతి సాధించిందని ఆ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కాసుల వెంకటేశ్ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గడిచిన కాలంలో ప్రధాని నరేంద్రమోదీ సుపరిపాలన అందించారని తెలిపారు. దేశం ఘననీయంగా అభివృద్ధి చెంది, విశ్వవ్యాప్త గుర్తింపు తెచ్చుకుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గోరటి నర్సింహ, జగన్, భగవాన్ రెడ్డి, సీతారామారావ్, మల్లేశ్, శ్రీనివాస్, రమేశ్, జంగయ్య, రాగవేందర్, ఒగ్గు ప్రభాకర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు మంజూరుకు వినతి

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శంకరకొండతండా పరిధి దయ్యాలబోడు తండాకు అరకిలో మీటర్ బీటీరోడ్డు మంజూరు చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని తండా వాసులు కోరారు. ఈ మేరకు గురువారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఇందులో నాయకులు రాములు, విజయ్‌రాథోడ్, విజయ్, రాజు, శ్రీను, రాజేశ్, చంద్రునాయక్, హరిలాల్ ఉన్నారు.

'ఫిట్‌లెస్' బస్సులను సీజ్ చేయాలి



ఆర్టీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

తుర్కయంజాల్: ఫిట్‌నెస్ లేని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల బస్సులను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.శివ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పలువురు నాయకులతో కలిసి ఇబ్రహీంపట్నం ప్రాంతీయ రవాణా అధికారి సుభాష్ చందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వాహనాలను ఫిట్‌నెస్‌ను చేయించాల్సిన అవసరం ఉందన్నారు. బస్సుల్లో ఫైర్ సేఫ్టీ, ప్రైమరీ హెల్త్ చెకప్ కిట్‌లు అందుబాటులో ఉంచాలని, 15 ఏళ్లకు పై బడిన సర్వీసులు ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లపై తిరుగుతున్నాయని పేర్కొన్నారు. వేగ పరిమితిని తగ్గించడంతో పాటు, పరిమితికి మించి విద్యార్థులను తరలించవద్దని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, వివేక్, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు రహదారుల శోభ



కత్వవాగు వంతెనను ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి

- కల్వకుర్తిలో రూ.600 కోట్లతో రోడ్ల నిర్మాణం
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: రహదారుల నిర్మాణంతో పల్లెలు సరికొత్త శోభను సంతరించుకోనున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తద్వారా రవాణా మార్గం మెరుగు పడి, మరింత అభివృద్ధి చెందనున్నాయని పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో రూ.600 కోట్లతో బీటీరోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఆమనగల్లు మండలం శంకరకొండతండా కత్వవాగుపై రూ.3.10 కోట్లతో నిర్మించిన వంతెనను గురువారం రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అర్హులందరికీ అందజేస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులతో పాటు, కొత్తగా 8 సబ్‌స్టేషన్ల నిర్మాణం, 650 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను పంపిణీ చేశామన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామన్నారు. ప్రజాపాలనలో ప్రభుత్వం ప్రజల ఆదరణ పొందుతుంటే.. విపక్ష పార్టీలు తమ ఉనికి కోసం విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. తమది చేతల ప్రభుత్వమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు కిషన్‌రెడ్డి, జగన్, ప్రభాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ రవీందర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ అభిషేక్, మండల ప్రత్యేకాధికారి శోభారాణి, ఎంపీడీఓ మాదురి, మాజీ ఎంపీపీ అనిత, మాజీ ఎంపీటీసీ రాములు తదితరులు పాల్గొన్నారు.